క్లుప్తంగా

వరి ఆకు చివర్లు తుంచడం మంచిది



బర్లిలో వరి ఆకు తుంచడంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: వరి ఆకు చివర్లు తుంచడం వల్ల రసం పీల్చు పురుగులు పెట్టే గుడ్లు మొదటి దశలోనే నాశనమవుతుందని ఏఓ శ్రావణ్ తెలిపారు. మండలంలోని మిర్తివలస, బర్లి గ్రామాల్లో నారుమడులు పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. చివర్లు తుంచడం వల్ల రసం పీల్చే పురుగుల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. రైతులు ఆకును ఊడిచేందుకు కట్టలు కడుతున్నప్పుడే వరి ఆకు చివరను తుంచడం మంచిదన్నారు. గట్లుపైన కందులు వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు వి.గోవిందరావు, కె.లక్ష్మణరావు, పి.జగన్నాథం, వీఏఏలు ప్రశాంతి, చాందిని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి



విద్యార్థికి వినికిడి యంత్రం అందించిన ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: ప్రత్యేక అవసరాల విద్యార్థులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఎంఆర్‌సీ వద్ద వంతరాం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్‌కు ధ్వని వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. మండలంలో సర్వే చేసి ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వపరంగా వారికి అవసరమైన పరికరాలు అందిస్తున్నారని తెలిపారు. వారిపై దృష్టి సారించి మేలు జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అజయ్, రిసోర్స్ పర్సన్ రమణమ్మ, జగదీష్, భద్ర, రామయ్య పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారీలో జాగ్రత్త

సీతానగరం: వరిచేనులో మిత్రపురుగులకు హానిలేకుండా శత్రు పురుగుల నివారణకు మందులు పిచికారీ చేస్తున్న సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు బుధవారం కామందొరవలసలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఎంట్రీ పాయింట్ ఏక్టివిటీని చేయించి నియమిత మోతాదులో పురుగు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.పురుగుల నివారణకు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు అవగాహన కల్పించుకోవాల ని చెప్పారు.కార్యక్రమంలో సర్పంచ, బి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు గోపాలకృష్ణ పకీరునాయుడు, బి.గౌరునాయుడు, ముకుందరావు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపు తనిఖీ



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను పార్వతీపురం నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి, కవిటిభద్ర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు 74, 92 పరిధిలో ఆమె పర్యటించారు. గ్రామస్తుల సమక్షంలో తొలగించిన ఓటర్ల జాబితా చదివి వినిపించారు. దీర్ఘకాలికంగా గ్రామంలో లేకపోవడం లేదా మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు శాతం కంటే ఎక్కువ తొలగింపులు ఉంటే నిశితంగా పరిశీలించాలని సహాయ ఓటరు నమోదు అధికారి, బూత్ స్థాయి అధికారులకు ఆర్డీఓ సూచించారు. ఇంటింటి సర్వే పక్కాగా ఉండాలని, ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు ఉండరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకరరావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలోని కొంకివీధిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్, ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయో వివరించారు. ప్రమాదాలను ఎలా నివారించాలో అవగాహన కల్పించారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని దీవించాలి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజాసమస్యల పరిష్కారం, ప్రతి వ్యక్తికీ సంక్షేమం అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలంలోని పెదంకలాంలో ఎంపీపీ బి.రమణమ్మ, సర్పంచ్ బి.శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనరు బి. శ్రీరాములుతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ,గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

గ్రామంలో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, ఉపాధిహామీ ఏపీఓ భాను, ఏపీఎం శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సుమిత్రాపురం, కృష్ణారాయపురం, చిన భోగిలి, గాదెలవలస, వెంకటాపురం, బూర్జ గ్రామాల సర్పంచ్‌లు వెంకటాపురం,తామరఖండి,పెదభోగిలి 1,2, చినభోగిలి ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, రెడ్డి అప్పలనాయుడు, వెంపలి గుర్రాజు, ఎస్.కిరణ్‌కుమార్ తిరుపతిరావు శివున్నాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ప్రాజెక్ట్ ద్వారా నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: సువర్ణముఖి నదిపై ఉన్న సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ ద్వారా నిర్దేశించిన భూములకు సాగునీరు సరఫరా చేయడానికి అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ టి.వెంకటప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలుగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లతో కలిసి సాగునీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదలతో మక్కువ, సీతానగరం మండలాలకు చెందిన కంచివానివలస, వెంకటభైరిపురం, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం, తామరఖండి, బక్కుపేట, చినభోగిలి, కాశీపేట, పణుకుపేట, ఆర్ వెంకంపేట, రంగంపేట, అనంత రాయుడు పేట, గెడ్డలుప్పి కొత్తవలస తదితర గ్రామాలకు చెందిన 3,478 ఎకరాల భూములకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఇరిగేషన్ డీఈ, ఏఈలు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు వెంపలి గుర్రాజు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఎ.నారాయణరావు, ఆర్.అనిత, ఎ.తిరుపతినాయుడు, ఎన్.సుశీల, మన్మథరావు, జి.అప్పారావు, పండా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పి.ఈశ్వరనారాయణ, ఎం ధనుంజయ్, ఎంపీటీసీ జి.బుజ్జి, పి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్తలు, రైతులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీటీరోడ్డుకు భూమిపూజ



బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్లను బీటీరోడ్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తామరఖండి సచివాలయం పరిధిలో ఉన్న బక్కుపేట-తామరఖండి గ్రామాల ప్రజలు చిరకాలంగా ఎదుర్కొంటున్న రాకపోకల సమస్య పరిష్కరించేందుకు రూ.20 లక్షలతో 2.65 కిలో మీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తామరఖండిలో ఉన్న సచివాలయానికి వచ్చేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల ప్రజలు కోరిన మేరకు జీజీఎంపీ నిధులు మంజూరుచేసినట్లు తెలియజేశారు. త్వరలో అంటిపేట-వెంకటాపురం- బొబ్బిలి మండలం కోమటిపల్లి మక్కువ అజ్జాడ రోడ్డులో కృష్ణారాయపురం గ్రామంలోని అమ్మవారి గుడివరకూ బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ జి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎం.మన్మథరావు, ఎంపీటీసీ వై.గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, బక్కుపేట సర్పంచ్ జి.అప్పారావు, వై. శ్రీరాములు, చినభోగిలి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస సర్పంచ్‌లు కె.రాధ, ఎ.నారాయణరావు, ఎ.తిరుపతిరావు, ఆర్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితాకు సహకరించండి

• జాయింట్ కలెక్టర్ గోవిందరావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం:

కచ్చితమైన ఓటరు జాబితా తయారీలో భాగంగా కచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీ కోసం క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి బూత్ స్థాయి అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు జరగకుండా లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పారదర్శకంగా, కచ్చితమైన జాబితా రూపొందించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి ఓటర్ తొలగింపు అంశానికి సంబంధించి ప్రతి ఓటును క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, దీనికి ఓటరు నమోదు అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడిని ఓటరుగా నమోదు చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వి.శ్రీనివాస రావు, టీడీపీ నుంచి డి.చంద్రమౌళి, కాంగ్రెస్ తరపున ఎన్.సింహాచలం, బీజేపీ నుంచి ఎ.పేర్రాజు, సీపీఎం ప్రతినిధి కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



గర్భిణుల టీకా రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

• డీఎంహెచ్ఓ జగన్నాథ రావు

సీతానగరం: సీజనల్ వ్యాధులు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు తనిఖీలు చేస్తున్న విధానం, వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న రికార్డులను పరిశీలించారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులకు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించేలా సిబ్బంది పర్యవేక్షించాల్సి ఉందన్నారు. గర్భిణులు తీసుకుంటున్న ఆహారం, అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

పీహెచ్‌సీలో రోగులకు వైద్యసేవలందించడం బాగుందని ఓపీ పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేసినా ప్రసవాల సంఖ్య తగ్గడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. అంతకుముందు నిడగల్లులో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌ను, బూర్జలో ఉప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, ఎంపీహెచ్ఈఓ జి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల సంక్షేమం కోసం 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురంటౌన్: అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె పార్వతీపురం పట్టణంలోని 10వ వార్డు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష క్యాంప్ ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవి, కౌన్సిలర్‌లు మంత్రి ఉమామహేశ్వరి, సంగిరెడ్డి లక్ష్మీపార్వతి, తెలుగు బోదయ్య, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆర్యవైశ్య సంఘం తోడ్పాటు

సీతానగరం:



స్నాక్స్, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

మండలంలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటామని ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి విశ్వేశ్వరరావు, మండలనాయకుడు ఏవీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త కె శ్రీనివాసరావు, ఆర్య వైశ్య సంఘం నాయకులు కె.లక్ష్మణరావు,ఆరిసెట్టి గోవిందరావు, పదో తరగతి విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకా నిర్వహణకు ముందస్తు ప్రణాళిక తప్పనిసరి



టీకా నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహన్ రావు

పార్వతీపురంటౌన్: టీకా నిర్వహణకు ముందస్తు కార్యచరణ ప్రణాళిక తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన 15,16 వార్డులకు చెందిన టీకా నిర్వహణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. టీకా వేయాల్సిన పిల్లలు, గర్భిణుల అర్హుల జాబితా ఈ సందర్భంగా పరిశీలించారు. టీకా గడువు తేదీలను నమోదు చేయడం, ముందస్తు సమాచారం ఇవ్వడం, వేస్తున్న టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించడం తదితర అంశాలపై సిబ్బందిని ఆరాతీశారు. వైద్యసిబ్బంది వారి పరిధిలో ఉండే గర్భిణులందరికీ టీడీ వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం వేయడం పూర్తి చేయాలని, అదే విధంగా పిల్లలకు వేసిన ప్రతి టీకా వివరాలు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అదేరోజు నమోదు చేయాలని స్పష్టం చేశారు. టీకా కార్డులు, రిజిస్టర్‌లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. నిర్వహించాల్సిన టీకా కార్యక్రమాల ముందస్తు ప్రణాళిక వేసుకోవాలని, విధిగా జిల్లా ఆరోగ్య కార్యాలయానికి పంపించాలని చెప్పారు. అనంతరం సీజనల్ వ్యాధుల దృష్ట్యా పిల్లలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్ఎంలు నారాయణమ్మ, రామలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు పూర్తిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం చేపడుతున్న పనులపై ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్షించారు. వర్షాలు ప్రారంభమయ్యాయని, చివరి దశలో ఉన్న పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ప్రాధాన్యతా భవనాలు, పాఠశాలల భవనాలు ఉంటే వేగంగా ఆయాశాఖలకు అప్పగించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో ప్రహరీలు, కిటికీలు, తలుపులు తదితర వసతులును పరిశీలించి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతేశ్వరరావు, డీఈ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానం అధిరోహించాలి

• జాయింట్ కలెక్టర్ గోవిందరావు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: ఎంచుకున్న లక్ష్యాల సాధన దిశగా పయనించి విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో ఓ ప్రైవేట్ కళాశాల నుంచి ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన పూడి హరిప్రియదర్శిని, తుంబలి సందీప్, కడియాల గౌతమ్ కుమార్‌లను సత్కరించారు. అలాగే ఇంటర్మీడియట్‌లో 985/1000 మార్కులు సాధించిన గెంబలి విజయగౌరీ, 464/470 మార్కులు సాధించిన కొంపల్లి సుహర్షిణిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.